'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వాములవ్వాలి


యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

చింతల్: 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రకు ఎంపీ ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ నేతలు డా ఎస్ మల్లారెడ్డి, జేకే శేఖర్ యాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, ఒక్కంటి దయాకర్, భరత సింహారెడ్డి, నల్ల జయశంకర్ గౌడ్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి మరింత చొరవ తీసుకోవాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: కీలక కేసుల పరిష్కారానికి మరింత చొరవ తీసుకోవాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. అసిస్టెంట్ డీసీపీ పురుషోత్తంతో కలిసి మేడ్చల్ జోన్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బందితో బుధవారం క్రైం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కీలక కేసులను చేధించడంలో అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన దర్యాప్తుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో జీడిమెట్ల, దుండిగల్, పేట్‌బషీరాబాద్, మేడ్చల్, జీనోమ్ వ్యాలీ, శామీర్‌పేట్, సూరారం పోలీస్‌స్టేషన్ల సీఐలు, డీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు సర్కారు అండగా నిలవాలి

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు అండగా నిలవాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ కోరారు. ప్రగతినగర్–జేఎన్‌టీయూ సీఐటీయూ ఆటో స్టాండ్ ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా సయ్యద్ జమీల్ , ఉపాధ్యక్షుడిగా బాబు నాయక్ , గౌరవాధ్యక్షుడిగా నిజాంపేట్ కార్పొరేటర్ వెంకట రామయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఆటోవాలాలు గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు శంకర్, కృష్ణనాయక్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు మహేశ్‌రెడ్డి, వెంకటేశ్, ప్రభుదాస్, నరసింహ, సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న చంద్రశేఖర్ తదితరులు

సమస్యల పరిష్కారానికి పోరాటం


బాచుపల్లి మండల నూతన కార్యవర్గం

నిజాంపేట్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ పోరాడుతుందని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి అన్నారు. ప్రగతినగర్ జడ్పీ పాఠశాలలో చెన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాచుపల్లి మండల శాఖ నూతన కార్యవర్గన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పర్మగల్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా మాలి ప్రమోద్ కుమార్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, మహిళా ఉపాధ్యక్షురాలుగా సుమతి, కార్యదర్శిగా శివ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూతన కార్యవర్గాన్ని అభినందించి సత్కరించారు.

శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే

కుత్బుల్లాపూర్: కొంపల్లి సమీపంలోని కేవీఆర్ గార్డెన్‌లో సుచిత్రలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రవి కుమార్, అసోసియేట్ ఎగ్జిక్యూటివ్ డీన్ శంకర్రావు. ఏజీఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతల్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల..

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో చింతల్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను బుధవారం నిర్వహించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం నాగేశ్వరరావు, అసోసియేట్ ఎగ్జిక్యూటివ్ డీన్ శంకర్‌రావు, అసోసియేట్ డీన్ సుమన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న ఏజీఎం రవికుమార్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఏళ్లుగా గోస పడుతున్నా పట్టించుకోరా..?

- గుంతల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
- ఆందోళనకు దిగిన దుండిగల్ తండా–2, గాగిల్లాపూర్ వాసులు


ఆందోళన చేస్తున్న తండావాసులు

దుండిగల్: తమ తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను విన్నవించినా స్పందన లేదని నిరసిస్తూ దుండిగల్ తండా–2, గాగిల్లాపూర్ తండావాసులు బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. దీంతో సుమారు 2 గంటల పాటు వా హనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసు కున్న దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నర్సాపూర్ నుంచి తండాల వరకు అధ్వానంగా రోడ్డు..

నర్సాపూర్ నుంచి ఈ తండాల వరకు సుమారు 1.5 కిలోమీటర్ల ప్రధాన రోడ్డు ఉంది. అయితే గత 12 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు ప్రస్తుతం గుంతల మయంగా మారింది.

మున్సిపాలిటీగా ఏర్పడిన మారని పరిస్థితి..

గ్రామాలతో పాటు తండాలను సైతం విలీనం చేసి దుండిగల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. అయితే పట్టణీకరణ దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. రోడ్డు బాగా లేకపోవడంతో బస్సు సదుపాయం కూడా నిలిపివేశారు. ఆటోలు కూడా సరిగా రాకపోవడంతో వివిధ పనులపై వెళ్లే ప్రజలు నర్సాపూర్ రహదారి వరకు కాలినడకనే వెళ్తున్నారు.


నచ్చజెప్తున్న పోలీసులు

పరిశ్రమలతో ఇక్కట్లు..

దుండిగల్ తండా–2, గాగిల్లాపూర్ తండాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. దీనికి తోడు ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లోని పరిశ్రమలకు ఇక్కడి నుంచే దగ్గరి దారి. దీంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

ఆందోళన చేసినా ఫలితం శూన్యం..

ఈ తండాల రోడ్డు నుంచి భారీ వాహనాలు వెళ్తుండడంతో పలుమార్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో ఏ మాత్రం చలనం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నర్సాపూర్ హైవే నుంచి తండా–2 రోడ్డు అధ్వానంగా మారింది. పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు విన్నవించినా ఫలితం లేకుండా పోతున్నది. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్పందించి నూతనంగా రోడ్డు నిర్మించాలి.

–కొర్ర హనుమంతు నాయిక్, స్థానికుడు

నిత్యం భారీ వాహనాలు..



దుండిగల్ తండా–2 మీదుగా నిత్యం పెద్ద సంఖ్యలో ఇండస్ట్రీస్ వెహికల్స్ వెళ్తుంటాయి. వాటి కారణంగానే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు సమస్య పరిష్కరించాలని పలు మార్లు ధర్నాలు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ఇండస్ట్రీస్ వాళ్లకు చెప్పినా పట్టించుకుంటలేరు. అధికారులు, ప్రజాప్రతినిధులు అయినా పట్టించుకోవాలి.

–శంకర్ బవలాల్ మహరాజ్, పంతులు

దాడులు చేయడం తగదు

దుండిగల్: దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ కళాశాల అధ్యాపకులపై ఓయూ జేఏసీ, పలు విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం దాడి చేయడాన్ని తెలంగాణ ఇంజినీరింగ్ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి తీవ్రంగా ఖండించారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కేటాయింపు విషయంలో ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని, దానికి కళాశాలను బాధ్యులను చేస్తు కొందరు విద్యార్థి సంఘాల నేతలు దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిజాంపేట్‌లో భారీ వర్షం


ప్రగతినగర్ ఇన్‌కాయిస్ చౌరస్తా వద్ద ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నిజాంపేట్: కార్పొరేషన్‌లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రగతినగర్ ఇన్‌కాయిస్ చౌరస్తా వద్ద వరద చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేగాకుండా ఇన్‌కాయిస్ చౌరస్తా నుంచి ఏనుగుబొమ్మ చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది.

తహసీల్ కార్యాలయంలో సమావేశం


అధికారులతో సమావేశమైన తహసీల్దార్ రెహమాన్ ఖాన్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన డీటీ మల్లికార్జున రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గులాం కలీం, విజయ్ కుమార్, సర్వేయర్ జ్యోతితో బుధవారం తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే వారి పనులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జాకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో బుధవారం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమరయోధుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నాయి. సమరయోధుల త్యాగాలను చిన్నారులకు వివరించేందుకే పోటీలు నిర్వహించినట్లు చైర్మన్ కోటిరెడ్డి తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌పై పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా (స్థానిక సంస్థలు) ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌పై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. కచ్చితమైన ప్రణాళికతో పక్కాగా సర్వే చేసేందుకు సులభంగా సంబంధిత విషయాలను సకాలంలో పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు, విధి విధానాలకు సంబంధించిన సూచలను అదనపు కలెక్టర్ అందించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో బృందాలుగా ఏర్పాటుచేసి, మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు (నీటిపారుదల శాఖ), ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. రోజువారీగా నిర్వహిస్తున్న సర్వే ఆధారంగా పల్లెలు, పట్టణ ప్రాంతాలలో వైద్య పరీక్షలు చేపడుతూ పరిస్థితులను అనుగుణంగా అంబులెన్సులు, మందులు, రాపిడ్ టెస్ట్ కిట్లను అందుబాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. బుధవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ గౌతమ్ మట్లాడుతూ... పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిశుభ్రత, ఆహార, ఆరోగ్య విషయాలపై మండల ప్రత్యేక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, రోజువారీ సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. వీధి కుక్కలు, కోతులను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో నమోదైన డెంగీ కేసుల వివరాలను గుర్తించి రోగులకు కావలసిన ప్లేట్‌లెట్స్ ఎక్కించడానికి తగినంత రక్తాన్ని నిలువ ఉంచుకోవాలన్నారు. డెంగీ, వైరల్ జ్వరాలతో వచ్చినవారికి ఆయా ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయాలను కల్పిస్తూ అదనంగా కావలసిన మందులు, బెడ్లు, రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..!

సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో అక్రమంగా 10 షట్టర్ల పనులు


సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో చురుగ్గా జరుగుతున్న షెట్టర్ల పనులు

కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులోని ఓ వివాదాస్పద స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా 10 షట్టర్లు నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. సదరు నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, జోనల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది సైతం చోద్యం చూస్తుండం విమర్శలకు తావు ఇస్తున్నది. పైప్‌లైన్ రోడ్డులో ఇప్పటికే ఈ నిర్మాణానికి ఆనుకొని గతంలో అక్రమంగా షట్టర్స్ వేశారు. వాటిపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకుండా అధికారులు గ్రేటర్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. మూడు రోజులుగా షట్టర్లు వేసేందుకు రాత్రింబవళ్లు పనులు చేపడుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్, ఇతర విభాగం అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే జీడిమెట్ల గ్రామం సర్వే నంబర్ 350 స్థలం విషయం కోర్టులో ఉండగా కేసులు కూడా నమోదయ్యాయి. అయినప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం విశేషం.అయితే పైప్‌లైన్ రోడ్డులో నిర్మాణం విషయంపై టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబాను 'సాక్షి' వివరణ కోరగా ఆ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని, అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని హెచ్చరించారు. పరిశీలించి తొలగిస్తామని తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన


ఓటు వేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాయని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సుభాష్ నగర్‌లోని స్కూల్‌లో స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ విభాగాలకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటును అమ్ముకుంటే ఎంత నష్టపోతామో వారికి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.